క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకాబడే క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, బ్యాంకు కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష

కలికిరి: మండల పరిధిలోని పింఛన్ దారులకు జూలై 1వ తేదీ పింఛన్ నగదు పంపిణీపై ఎంపీడీఓ రామక్రిష్ణయ్య సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 7027 పింఛన్ దారులున్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరికి జూలై 1న పింఛను అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందికి అవసరమైతే ఇతర శాఖల సిబ్బంది సేవలను వినియోగించుకోవచ్చన్నారు. మొత్తం 100 శాతం పింఛన్ పంపిణీకి కృషి చేయాలన్నారు.

పింఛన్ల పంపిణీపై ప్రణాళిక

పెద్దతిప్పసముద్రం: సామాజిక పింఛన్ల పంపిణీపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసామని ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వివిధ రకాల నెలవారి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ సొమ్మును శనివారం బ్యాంకుల ద్వారా డ్రా చేసి ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది చేత జూలై 1వ తేదీన పంపిణీ చేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. పెన్షన్‌దారులకే నేరుగా డబ్బులు ఇస్తామని, సచివాలయ సిబ్బంది కొరత ఉన్న గ్రామాల్లో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది కూడా పెన్షన్ల పంపిణీలో భాగస్వాములు అయ్యేలా చర్యలు చేపట్టామని ఎంపీడీఓ తెలిపారు.

పీలేరు పంచాయతీ ఈఓగా గురుమోహన్



పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ ఈఓగా వై. గురుమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఈఓగా పని చేస్తున్న గఫూర్ సెలవుపై వెళ్లారు. కలికిరిలో ఈఓగా పని చేస్తున్న గురుమోహన్ బదిలీపై పీలేరుకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అంతరం ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న సోఫియా

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల మోములో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం తంబళ్లపల్లెకు చెందిన నజీర్, షాహినూర్ కుమార్తె సోఫియా హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్ధిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళ గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడుకు చెందిన భార్యాభర్తలు అంజి, రాజేశ్వరి(25)లు ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు ఆమె అదుపుతప్పి కిందపడింది. తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

డయేరియా రోగులకు ప్రత్యేక బెడ్లు ఏర్పాటు

తంబళ్లపల్లె: స్థానిక సీహెచ్‌సీలో డయేరియా బారినపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు శుక్రవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య తెలిపారు. మండలంలో డయేరియా కేసులు ఎక్కువ అవుతుండటంతో వారికి ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైన డయేరియా బారిన పడితే వెంటనే చికిత్స పొందాలన్నారు.

పదవీ విరమణ సన్మానం

కురబలకోట: ములకలచెరువు క్లస్టర్ వెలుగు ఏపీఎం రాజన్న, కురబలకోట, తంబళ్లపల్లె సీసీలు సయ్యద్‌బాషా, భవానీ శంకర్ పదవీ విరమణ సందర్భంగా వారికి కురబలకోట వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. చిత్తశుద్ధితో చేసిన వారి సేవలను ప్రశంసించారు. అంకిత భావంతో పనిచేసిన వీరు పదవీ విరమణ చెందడం బాధాకరంగా ఉందని వ్యక్తం చేశారు. ఏపీఎం నీరజ, సరస్వతి, భారతి, బాలాజీ, శంకరమ్మ, తులసీ, వసంత, తులసీ, చంద్రకళ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ ఆణిముత్యాలు

- సత్తాచాటిన వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు
- ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు 25 మంది ఎంపిక
- పదో తరగతిలో 67 మందికి 500కుపైగా మార్కులు
- మున్సిపల్ పాఠశాలల్లో రాష్ట్రంలో నంబర్ వన్



ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె సిటీ: కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. పదో తరగతి పరీక్షలతో పాటు పలు పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటిన మదనపల్లె పట్టణం వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శభాష్ అనిపించుకుంటున్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల నంబర్‌గా నిలిచింది. పది, పోటీ పరీక్షల ఫలితాల్లో మంచి ఫలితాలు సాధిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తోంది.

అన్ని రంగాల్లో రాణింపు

మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రాంరెడ్డి లేఅవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 550 మార్కులుపైగా 31 మంది, 500 మార్కులుపైగా 67 మంది సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు దీక్షిత, హేమమాలిని 582 మార్కులు సాధించి మొదటి స్థానం నిలిచారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు 25 మంది అర్హత సాధించారు. దీంతో పాటు క్రీడల్లో సైతం విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ

పాఠశాలకు చెందిన విద్యార్థులు గత ఏడాది ఎన్ఎంఎంఎస్‌కు 51 మంది ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే ఒకే పాఠశాల నుంచి 51 మంది ఎంపికకావడం గమనార్హం.గత ఏడాది ట్రిపుల్ ఐటికి 18 మంది ఎంపికయ్యారు. పదిలో గత ఏడాది 550కిపైగా 13 మందికి, 500 కుపైగా 30 మంది విద్యార్థులకు వచ్చాయి . ప్రతి ఏడాది పాఠశాలలో మంచి ఫలితాలు వస్తున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది. 1000 మందికిపైగా విద్యార్థులకు కేవలం 25 మంది మాత్రమే ఉన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా పాఠశాలకు 15 అదనపు గదులు అనుమతి వచ్చింది. ఇందులో ప్రస్తుతం 9 తరగతి గదులు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఉపాధ్యాయుల శిక్షణతోనే జిల్లా ఫస్ట్



ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల్లో 131 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ వచ్చాను. పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణ బాగుంది. ప్రత్యేకంగా సమయం కేటాయించడం వల్ల మంచి మార్కులు వచ్చాయి.

-సాయి సాహితీ, వివేకానంద మున్సిపల్ హైస్కూల్

పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇందుకు ఉపాధ్యాయులు అందరూ కలిసి కష్టపడి పని చేస్తున్నారు. వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

-రాజేంద్రప్రసాద్, హెచ్ఎం, మదనపల్లె

జూలై 25న హార్సిలీహిల్స్‌లో శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జే.రామచంద్రయ్య

మదనపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో జూలై 25న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రామచంద్రయ్య తెలిపారు. శుక్రవారం మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ... హార్సిలీహిల్స్‌లో జరగనున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్ల నుంచి దాదాపు 300 మంది పారిశుధ్య, ఇతర తరగతుల కార్మికులు పాల్గొంటారన్నారు. కార్మిక హక్కులు, చట్టాలు, శ్రమదోపిడీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మూడోసారి దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను, హక్కులను నిర్వీర్యం చేస్తోందని, గడచిన పదేళ్లలో ఏ ఒక్కరోజు కార్మికసంఘాల నేతలను పిలిచి, కార్మిక సమస్యలపై చర్చ జరపలేదన్నారు. దేశసంపదను కార్పొరేట్లపై ఉన్న శ్రద్ధ దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికసంక్షేమంపై లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఐటీయూసీ చిత్తూరుజిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో నిర్మాణాలు చేపట్టకపోతే పట్టా రద్దు

– తహసీల్దార్ రమాదేవి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

మదనపల్లె : పట్టణంలోని బీకే.పల్లె రెవెన్యూ గ్రామంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కేటాయించిన 22 లేఅవుట్లలో పట్టాలు మంజూరై నిర్మాణాలు చేపట్టనివారు, నెలరోజుల్లో ఇళ్ల నిర్మించుకోవాలని, లేనిపక్షంలో పట్టా రద్దు చేస్తామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు హౌసింగ్, రెవెన్యూ అధికారులు బీకే.పల్లె కాలనీలో పర్యటించారు. ఈ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల కింద 22 లేఅవుట్లను కనపరిచి, 4,842 మందికి ఇళ్ల కట్టుకునేందుకు పట్టాలు, ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. వీరిలో చాలామంది వరకు ఇళ్లు నిర్మించుకుని, నివాసం ఉంటున్నారని, అయితే దాదాపు 800 వరకు ఇంకా నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వీటిని కొందరు అక్రమార్కులు కబ్జాలు చేసి ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసేందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా..22 లేఅవుట్లకు 22 బృందాలను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి బృందంలోనూ సర్వేయర్, వీఆర్వో, హౌసింగ్, అడ్మిన్ సెక్రటరీ ఉంటారని, వీరు ఇంటింటికీ వెళ్లి అర్హులు, అనర్హుల జాబితాను గుర్తిస్తారని తెలిపారు. 2006, 2007లో పట్టాలు మంజూరై ఇప్పటివరకు నిర్మాణాలు చేపట్టని వారు ఇదే చివరి అవకాశంగా భావించి 30రోజుల్లో స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సర్వేలో స్థలం ఖాళీగా ఉందని తేలితే, మంజూరు చేసిన పట్టాను రద్దుచేసి, ఆ స్థలాన్ని అర్హులైన పేదలకు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు పాల్గొన్నారు.

నల్లవీరగంగాభవాని ఆలయానికి విరాళం



నగదు వితరణగా అందిస్తున్న దాతలు రాజ, శ్రీదేవి

వాల్మీకిపురం: స్థానిక గంగమ్మగుడివీధిలోని నల్లవీరగంగాభవాని అమ్మవారికి దీపతోరణం చేయించేందుకు మదనపల్లి రాజ్‌భవన్ గ్రూప్స్ అధినేత రాజ, శ్రీదేవి దంపతులు రూ.50వేలు నగదు వితరణ అందించారు. శుక్రవారం స్థానిక గుడిలో ధర్మకర్త రమణారెడ్డికి విరాళ మొత్తాన్ని అందజేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, రమణమ్మ, పూజారి జనార్థన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కేవీపల్లె : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అతిసారా నియంత్రణపై అవగాహన సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై ఒకటో తేది నుంచి ×స్టాప్ డయేరియా క్యాంపెయిన్¥ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు వారి పరిధిలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో యాదవేంద్ర, డాక్టర్ రేష్మ, ఎంఈవో రెడ్డిబాషా, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణం పరిశీలిస్తున్న ఏడీఏ శివశంకర్

పీలేరు రూరల్ : నిబంధనలకు లోబడి ఎరువులు, విత్తనాలు విక్రయించాలని మదనపల్లె ఏడీఏ కె. శివ శంకర్ అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. అమ్మిన ఎరువులు, విత్తనాలకు సంబంధించి విధిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె మండల ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి గర్భాశయ కేన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీనివాసా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి శశికుమార్‌రెడ్డ తెలిపారు. ఆదివారం అరవిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస చారటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పరీక్షలు చేయడం తోపాటు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

కలికిరి ఉప సర్పంచ్ రాజీనామా

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ నూరిన్నీషా తన పదవిని రాజీనామా చేశారు. 2021లో జరిగిన ఎన్నికలలో కలికిరి పట్టణం 4వ వార్డు నుంచి వార్డు సభ్యురాలుగా ఎన్నికైన ఆమె తదనంతరం ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం తన అనారోగ్య కారణాల రీత్యా పదవీ బాధ్యతలకు న్యాయం చేయలేక పోవడంతో రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం కార్యదర్శికి లేఖ అందజేశారు.

తల్లిదండ్రులను హతమార్చిన కుమారుడిని శిక్షించాలి

మదనపల్లె సిటీ: వీరబల్లి మండలం కొత్తవడ్డిపల్లె గ్రామానికి చెందిన నాగసుబ్బన్న, నాగమ్మలను హతమార్చిన కుమారుడు, కోడలు వెంకటరమణ, కళావతిలను కఠినంగా శిక్షించాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మునిగోపాలకృష్ణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మానవతా విలువలు రోజు రోజుకు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు.

ఏపీ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

వాల్మీకిపురం: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంసా) వాల్మీకిపురం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రెసిడెంట్‌గా బాలాజి, సెక్రటరీగా జావిద్, ట్రెజరర్‌గా సురేఖ, మహిళా సెక్రటరీగా నాగరత్న, వైస్ ప్రెసిడెంట్‌గా మద్దమ్మ, నిక్‌బి, జాయింట్ సెక్రటరీగా సరితలు ఎన్నికై నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజా తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలోని సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు అన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. వారు ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేశారు. తమ సమస్యలను విన్న ఎమ్మెల్యే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షులు బివి రమణ, కార్యదర్శి కోదండరామయ్య, కోశాధికారి వెంకట్రాయప్ప పాల్గొన్నారు.

జై జవాన్ వృద్ధాశ్రమం పునఃప్రారంభం

మదనపల్లె : మండలంలోని వలసపల్లె పంచాయతీ బోయకొండ రోడ్డులో జై జవాన్ వృద్ధాశ్రమాన్ని పునఃప్రారంభించినట్లు మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షులు కంచర్లశ్రీ నివాసులు నాయుడు తెలిపారు. శుక్రవారం పూజా కార్యక్రమాలతో వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

పీలేరు రూరల్ : దోమల నిర్మూలన సామాజిక బాధ్యత అని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం పీలేరులో వివిధ పాఠశాలల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ అరుణ్, స్టాఫ్ నర్స్ ప్రమీల, పర్యవేక్షకులు చిన్నయ్య, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాను ఉపేక్షించేది లేదు

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



బీకే పల్లె కాలనీలో ఆక్రమణలపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

మదనపల్లె : పట్టణ శివారుప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల కబ్జాను ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బీకే.పల్లె కాలనీలో పెద్దసంఖ్యలో ప్రభుత్వస్థలాలు ఆక్రమణకు గురయ్యాయన్న స్థానికుల ఫిర్యాదుమేరకు శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ రమాదేవి, సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన...2009లో ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన స్థలం అన్యాక్రాంతమవడం, ఇళ్ల మధ్యలో ఖాళీస్థలాల్లో కబ్జాదారులు పునాదులు వేసుకొని ఉండటం గమనించారు. దీంతో బీకే.పల్లె కాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించి, ఆక్రమణలు గుర్తించి వెంటనే తొలగించాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. పట్టణంలోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తాను ముందుకెళతానని, పేదల ఇళ్ల స్థలాలు ఎవ్వరూ కబ్జా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. బీకే.పల్లెలో ఇతర నియోజకవర్గాలకు చెందిన ప్రజలు దాదాపు 200 మంది ప్లాట్లు ఆక్రమించుకున్నట్లు తనకు ఫిర్యాదులు అందాయని, వాటన్నంటిపైనా సమగ్రంగా సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దీనదయాళరాజు, సర్వేయర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ సదస్సులో కేవీకే 10వ స్థానం



అవార్డు అందుకుంటున్న కో-ఆర్డినేటర్ పాండురంగ

కలికిరి: భారత జాతీయ సాంకేతిక, పరిశోధన మండలి అధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు రాజమండ్రిలోని కేంద్రీయ పొగాకు పరిశోధనా స్థానంలో జరిగిన వార్షిక జోనల్ సదస్సులో రాష్ట్రంతో పాటు తెలంగాణా, తమిళనాడు, పుదుచ్చేరి పరిధిలో గల 72 కేవీకేల సమన్వయకర్తలు పాల్గొనగా కలికిరి కేవీకేకి 10వ స్థానం దక్కినట్లు కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. నూతన వేరుశనగ టిసిజిఎస్-1694 రకం ద్వారా బెట్ట పరిస్థితులలో రైతులు అధిక దిగుబడి సాధించడం, మామిడి రైతులు ఫ్రూట్ వకర్ల వాడకం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందడంపై అవగాహన కల్పించినందుకు గాను కేవీకేకి అవార్డు దక్కినట్లు తెలిపారు. అలాగే కేవీకే శాస్త్రవేత్తలు డా.కె.మాధురి, ఎస్.సోమశేఖర్ బాబు, డా. వై.పీరూసాహెబ్, డా. ఏ.శ్రీనివాసులు, కంప్యూటర్ ప్రోగ్రాం అసిస్టెంట్ బి.రమణ ప్రశంసా పత్రాలు పొందినట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

– ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



కేవీపల్లె: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

కేవీపల్లె : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. జూలై నెల 1వ తేదీన పింఛన్ లబ్ధిదారులకు రూ. 7 వేలు అందుతున్నారు. అనంతరం ప్రతి నెలా రూ. 4 వేలు వస్తుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు రఘురామిరెడ్డి, రమణ, హరినాథరెడ్డి, సురేష్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, సుధాకర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తరాదు

కలకడ : మండలంలోని ఏ గ్రామంలో మంచి సమస్య తలెత్తతకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా కలకడకు హాజరైన సందర్భంగా అభిమానులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు కలసికట్టుగా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని కార్యకర్తలను కోరారు. ఎంఈఓ మునీంద్రనాయక్ సిద్ధంగా ఉంచిన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మల్లారపు రవిప్రకాష్ నాయుడు, మల్లికార్జుననాయుడు, సర్పంచ్ విశ్వనాథ్, ఇనాయతుల్లా, మాజీ సర్పంచ్ జనార్దన్‌నాయుడు, నాయకులు ఆనంద, జిలానీ, శ్రీనివాసులురెడ్డి, కాంతారావ్, అల్లీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయం



కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పీలేరు : గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచ్ జీనత్ షఫీ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడడంతో కార్మికుల పాత్ర కీలకమైందని తెలిపారు. పంచాయతీ పరిధిలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు, పైపులైట్లు, విద్యుద్దీపాల మరమ్మతు పనులు చేస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి కార్మికులకు సీనియారిటీని బట్టి జీతాలు పెంచనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు సచిన్, నాగరాజనాయక్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో డయేరియా నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే డయేరియా నియంత్రణ సాధ్యం అని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని గండబోయనపల్లిలో డాక్టర్ శ్రీవిద్య పర్యవేక్షణలో డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చినందున వర్షాలు పడడం, మామిడి పళ్ల సీజన్ కావడం, పరిసరాల పరిశుభ్రత, దోమల వ్యాప్తి, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వలన నీళ్ల విరేచనాలు ప్రబలడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాణి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ములకలచెరువు: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, రూ.5 లక్షల దాకా బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని, రైతాంగానికి ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు అంజనప్ప, నారాయణ, రామచంద్ర, రమణారెడ్డిలు పాల్గొన్నారు.